క్లుప్తంగా

నియామకం



మొగుళ్లపల్లి: ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బండారి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నియామకపు ఉత్తర్వులు జారీ అయినట్లు ఆ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కొర్నెల్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు దెబ్బేట రమేశ్, మంగళపల్లి శ్రీను, ఓదేలు, దొడ్డి కిష్టయ్యలకు బండారి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ అందజేత



టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన నిడిగొండ సధాకర్ ఇటీవల తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. కాగా, సెల్‌ఫోన్‌ను ఎస్సై దాసరి సుధాకర్ ఆదేశాల మేరకు ఆదివారం హెడ్ సుమలత అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంటే నేరుగా మీ సేవాలో మిస్సింగ్ దరఖాస్తు చేసి, దరఖాస్తును పోలీస్‌స్టేషన్‌లో అందించాలని కోరారు.

కమిటీ ఎన్నిక



ఏటూరునాగారం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల వజ్రోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వహణకు కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఇర్సవడ్ల వెంకన్న, కో కన్వీనర్లుగా నూక ప్రభాకర్, తుమ్మ మల్లారెడ్డి, నామకరం చందుగాంధీ, కాకులమర్రి ప్రదీప్‌రావు, మహమ్మద్ హుస్సేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1968 నుంచి 2025 సంవత్సరం వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకునే విధంగా సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. మే 3, 4న నిర్వహించే సమావేశం విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులందరిని ఆహ్వానించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జగదాంబ సెంటర్‌లో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ కుమార్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోని మరికొంత మంది ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాని అశ్వపతి, చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్, శశికుమార్, అన్వర్, సలీం, కిషోర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జా!

- కోట్లాది రూపాయల విలువైన స్థలాలు అన్యాక్రాంతం

మంగపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో కొందరు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ఇరువైపులా సుమారు 08 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ప్రస్తుతం కనీసం 10 గుంటల స్థలం కనిపించక పోవడం గమనార్హం. ప్రభుత్వ స్థలాలు కబ్జాల పర్వం 10 ఏళ్ల క్రితం నుంచి నేటి వరకు కొనసాగుతున్నా అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు ఉదాసీనత ప్రదర్శించడం వెనుక అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట, పక్కన ఉన్న కోట్లాదిరూపాయల విలువైన భూములను ఇప్పటికే కొందరు రెవెన్యూ సిబ్బంది, మరికొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు దర్జాగా కబ్జాచేసి బహుల అంతస్తులను నిర్మించారు. సంబంధిత రెవెన్యూ, గ్రామపంచాయతీ శాఖలకు చెందిన కొందరు అధికారులు కబ్జాదారుల నుంచి రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని ఏజెన్సీ చట్టాల నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం, నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించడంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదివాసీ సంఘాల నాయకులు సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. 15 ఏళ్ల క్రితం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేసి పదవీ విరమణ పొందిన వ్యక్తి ఏటూరునాగారం-భూర్గంపాడు ప్రధాన రోడ్డు వెంట ఉన్న సుమారు కోటి రూపాయలకు పైగా విలువచేసే ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో కొద్ది రోజుల క్రితం కబ్జా చేసి రేకుల షెడ్డును నిర్మించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్ద భవనం నిర్మించే ఏర్పాట్లలో భాగంగా బోరుబావిని నిర్మిస్తున్నాడని వాపోతున్నారు.



ప్రభుత్వ స్థలంలో వేసిన రేకుల షెడ్డు

పెరిగిన డిమాండ్..

ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరునాగారం డివిజన్ కేంద్రంగా ఏర్పడనుంది. స్థానికంగా ఐటీడీఏ ఉండటంతో పాటు నూతనంగా ఆర్టీసీ డిపో ఏర్పడనుంది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు సైతం రానుండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు బార్డర్‌లో అనుసందానంగా ఏటూరునాగారం కేంద్ర బిందువుగా మారనుంది. దీంతో పొరుగున్న ఉన్న మంగపేట మండలంలో భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి సంబంధిత అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ప్రభుత్వ భూములు కనుమరుగు కాకుండా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవచూపాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లోని శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

- శ్రీనివాసాచారి, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు

సర్టిఫికెట్ ఉంది



ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న రిటైర్డ్ ఉద్యోగి నారాయణ స్వామికి గతంలో 2.20 గుంటల ఇంటి స్థలాన్ని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఇచ్చినట్లు ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించాడు. అప్పటి అధికారులు ఎందుకు ఇచ్చారో ఎలా ఇచ్చారనేది తెలియదు.

- తోట రవీందర్, తహసీల్దార్, మంగపేట

అఘాయిత్యాలు అరికట్టడంలో బీజేపీ విఫలం

- మంత్రి సీతక్క



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న రితీష్‌రావు

ములుగు : దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి హాజరై మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బీజేపీ అనుబంధ ఏబీవీపీ నాయకుడు బాలికపై అత్యాచారం చేయగా దోషులను శిక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించడం విడ్డూరమని దుయ్యబట్టారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సీతక్కను ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితీష్‌రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, యూత్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్‌యాదవ్, మార్క అభినయ్‌గౌడ్, రాహుల్, గణేష్, శ్రీధర్, రాజ్‌కుమార్, రేవంత్, ప్రవీణ్, వినయ్, చందు తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మహిళలు, ప్రభాకర్, తదితరులు

కాటారం: మండలంలోని అల్లిపూర్ గ్రామంలోని బేతేస్థ ప్రార్థన మందిరంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మిత్రాగ్రేస్ లోకల్ కమిటీ సహకారంతో నిర్వహించన కార్యక్రమంలో సీనియర్ పాస్టరమ్మ బజారు సాలోమిజయరాజ్‌తో పాటు పలువురు పాస్టరమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిత్రాగ్రేస్ మినిస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, శిరీషారాణి, నక్క లలిత, మణెమ్మ, సులోచన, క్రైస్తవ మతస్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పలు గ్రామాలలో రూ.20.20 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అబివృద్ధి చెందుతున్నయన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ రాంప్రసాద్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు నాయినేని సంపత్‌రావు, మోడెం ఉమేష్ గౌడ్, సూదనబోయిన ఓంప్రకాష్, పున్నం రవి, పట్టెం శంకర్, నిమ్మల విజేందర్, ముద్దమల్ల రవి, గంగుల రమణారెడ్డి, ఐలి శ్రీధర్, బొజ్జం రవి, బూర్గుల ప్రమదాదేవి, కోయిల క్రాంతి పాల్గొన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ ప్రారంభోత్సవ ఏర్పాటు పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమకు జీపీ భవనం ప్రారంభోత్సవం గురించి సమాచారం లేదనడంతో, విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని అన్నారు. మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సమయంలో సంబంధిత శాఖ జిల్లా అధికారులు హాజరుకాకపోవడంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

మిర్చి పంట క్షేత్ర పరిశీలన

పలిమెల: మండలంలోని సర్వాయిపేటలో అమెజాన్ సీడ్స్ మిరప ఏజెడ్ సీ–896 రకం పంటను క్షేత్ర ప్రదర్శన చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు విజయ్ మోహన్‌రావు తెలిపారు. సర్వాయిపేటకు చెందిన పెద్దల నాగార్జున అనే రైతు పంటను సుమారు 200 మంది రైతులతో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతులు, డిస్ట్రిబ్యూటర్ లక్ష్మణ్, ఏజెంట్ రాజు, సందీప్, సంస్థ ప్రతినిధులు రావుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పైనుంచి పడిన ట్రాలీ ఆటో



బ్రిడ్జి కింద ఉన్న ట్రాలీ ఆటో

వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం ట్రాలీ ఆటో బ్రిడ్జి పైనుంచి కింద పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకటాపురం(కె) వైపు నుంచి జగన్నాథపురం గ్రామం వైపునకు ట్రాలీ ఆటో వస్తూ అరుణాచలపురం గ్రామ సమీపంలో వాగుపై ఉన్న బ్రిడ్జి నుంచి కింద పడిపోయింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో అందులో ఉన్న డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ట్రాలీ ఆటోను ట్రాక్టర్ ద్వారా బయటకు లాగారు.

భూ సేకరణ గ్రామ సభలు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పలు గ్రామాల్లో నిర్మించనున్న ట్యాంక్‌లు, చెరువు పునరుద్ధరణ పనుల కోసం అవసరైన భూ సేకరణకు పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(సోమవారం) గారెపల్లిలో, ఈ నెల 11న జాదరావుపేట, 12న చిద్నెపల్లి గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ సేకరణపై రైతుల అభిప్రాయాలు, సేకరించాల్సిన భూ వివరాల గూర్చి చర్చించనున్నట్లు తెలిపారు.

కార్యకర్తలు కలిసికట్టుగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ నాయకులు తక్కళ్లపెల్లి రాజు, రఫీ అన్నారు. ఆదివారం పెద్ద కోమటిపల్లి, గణేశ్‌పల్లి గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

నర్సంపేట : అమరుల స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు కోరారు. పట్టణంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల చంద్రబోస్ 9వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాశ్ చంద్రబోస్ చిత్రపటానికి రాజు, నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడారు. భారత విప్లవోద్యమంలో తలెత్తిన అతివాద, మితవాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ ప్రజలందరినీ ప్రజాపంథా మార్గంలో నడిపించిన మహోన్నత విప్లవోద్యమ అగ్ర నాయకుడుగా సుభాశ్ చంద్రబోస్‌ను కొనియాడారు. బీజేపీ మతోన్మాద ఫాసిస్టు నిరంకుశ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కత్తుల కొమురయ్య, జవహర్‌లాల్, రాజ్‌కుమార్, మనోహరాచారి, లక్ష్మి, యాకయ్య, వెంకన్న, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో 'కార్పొరేట్'లకే లబ్ధి

- డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య

నర్సంపేట : నూతన విద్యావిధానంతో కార్పొరేట్ సంస్థలకే లబ్ధి చేకూరుతుందని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య తెలిపారు. పట్టణంలోని హనుమాల్ దేవల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఆ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేలా తప్పుడు విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. నూతన విద్యావిధానంతో ప్రభుత్వ విద్యాసంస్థలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలను సమాజంలోని ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సూచించారు. అనంతరం ఫెడరేషన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సర్దార్, ప్రధాన కార్యదర్శిగా కొత్ర రమేష్, జిల్లా కౌన్సిలర్లుగా దార్ల రవీందర్, ఎస్.విజయ, కొమ్మయ్య, రఘుపతి, ఉపాధ్యక్షులుగా కె.విజయ, బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పాలడుగుల రాజేందర్, గుగులోతు భిక్షపతి, శోభన్‌కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బుచ్చిరాములు, సభ్యులుగా శ్రీనివాసరావు, మర్ద వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పూర్వ జిల్లా అధ్యక్షుడు గుంటి రాంచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్, నల్లబెల్లి అధ్యక్షుడు పూజారి రవి, ఖాజామైనొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న వైద్య సిబ్బంది

గోవిందరావుపేట: పస్రాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ప్రాజెక్ట్ నగర్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న సురేఖ గుండెపోటుతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి పస్రా వైద్యాధికారి మధు ఆధ్వర్యంలో సిబ్బంది రూ.40 వేలు, వైద్య ఆరోగ్యశాఖలోని ఐఎన్‌టీయూసీ 3194 యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఫయాజ్ మొహిద్దిన్, ములుగు జిల్లా అధ్యక్షుడు వంగేటి వెంకటేశ్వర్లు, కోశాధికారి వినోద్, కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.55 వేలు మొత్తం రూ.95 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, యూనియన్ నాయకులు రిటైర్డ్ డీపీఎంఓ సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ హెచ్ఈఓ కత్తి మొగిళి, ఎస్‌యూఓపీ భూపాల్ రెడ్డి, ఎస్‌యూఓ సురేష్ బాబు, హెచ్ఈఓ సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, రిటైర్డ్ ఏఎంపీఓ మురారి, ఆరోగ్య కార్యకర్తలు సరోజన, సుజాత, వెంకటమ్మ, జంపయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిట్యాల: ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు



వాజేడులో..

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నేమరు వేసుకుని ఆనందంగా గడిపారు. విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు ఐత రాజయ్య, రాంమోహన్, భిక్షపతి, పగడాల ఐలయ్య, సోమేశ్వర్, మురళీధర్, తిరుపతిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు తాటిపెల్లి శ్రీనివాస్, బాలవేణి రాంబాబు, విజేందర్, శ్రీనివాస్, నరేందర్, దశరథం, రాజు, సతీశ్ కుమార్, శ్రీధర్, మహేందర్, యుగంధర్, అశోక్, ప్రవంతి, శ్రీవిద్య, ధనలక్ష్మీ, మమత, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నేమరు వేసుకుని ఆనందంగా గడిపారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రధర్ రావు, వెంకట్రావు, పియర్స్, కిషోర్, నర్సింహ రావు, సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, కృష్ణార్జున రావు, నర్సింహరావు, కృష్ణయ్య, వేణు ఉన్నారు.

కష్టపడితేనే ఉత్తమ ఫలితాలు

- ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

మొగుళ్లపల్లి: లక్ష్యంపై స్పష్టత.. అందుకు అవసరమైన ప్రణాళిక.. పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చు. ఇదే స్ఫూర్తిగా విద్యార్థులు సాధన చేయాల్సిందిగా ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పరీక్షల సమయంలోనే కాకుండా తరగతుల ప్రారంభం నుంచి ఒక ప్రణాళికతో చదవాలని అప్పుడు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని చెబుతున్నారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని తట్టుకునేలా తయారు చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఈ మేరకు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను తీరుస్తున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థుల్లో మనోధైర్యం కల్పిస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మండలంలో మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం, ఎంజేపీలను కలుపుకోని మొత్తం 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నారు. మొత్తం పదో తరగతి విద్యార్థులు 263 మంది ఉన్నారు. ఈ సంవత్సరం గతేడాదికంటే మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు అన్ని పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేదుకు అధికారులు కృషి చేస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తారని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు సిద్ధం కావాలి



పరీక్షల సమయంలో నుంచి ప్రణాళిక పరంగా పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి. మండలంలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

- ఎల్ కుమారస్వామి, ఎంఈఓ, మొగుళ్లపల్లి

వందశాతం ఉత్తీర్ణతకు కృషి



గత కొన్ని సంవత్సరాలుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్‌గా నిలవడం కోసం ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

- పింగిళి విజయపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, మొగుళ్లపల్లి

నాయకులకు అండగా ఉంటా..

నర్సంపేట : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కొంకీస మదన్‌కుమార్ గౌడ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించారు. తొలుత మదన్‌కుమార్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. మదన్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం 19వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కీసరి ముత్తయ్య సతీమణి ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పార్టీ నాయకులైన ఆమె కుమారులు నరేందర్, వెంకటేశ్వర్లును పరామర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి ఉన్నారు.